మీ గళం.. మా కలం...

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066



రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :125 ఎడిటర్: గొడిశాల సోమయ్య మంగళవారం 01-10-2024 పేజీలు :4 వెల : 2రూ


## ‘డీఎస్సీ పోస్టులకు 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్..

## అక్టోబర్ 9న నియామకపత్రాలు’ సీఎం రేవంత్ రెడ్డి




**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్, సెప్టెంబర్ 30: తెలంగాణ డీఎస్సీ ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ చేతుల మీదగా సోమవారం (సెప్టెంబర్ 30) విడుదలైన సంగతి తెలిసిందే. డీఎస్సీ-2024 ఫలితాల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 11,062 టీచర్ ఉద్యోగాల భర్తీకి విశేష కృషి చేసిన అధికారులకు నా అభినందనలు. 1:3 ప్రాతిపదికన ఫలితాలు ఫలితాలు విడుదల చేసాం. దసరా లోపు ఫైనల్ నియామకాలు పూర్తి చేస్తాం. అంతా సవ్యంగా జరిగితే అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందిస్తాం. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకే ఒక సారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. పదేళ్లలో వాళ్లు చేపట్టిన ఉపాధ్యాయ నియామకాలు కేవలం 7,857 మాత్రమే. విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి లేదు. మేం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ మొదలు పెట్టాం. విద్యకు మా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుంది. నిర్వహణ నుంచి నియామకాల వరకు 65 రోజుల్లో 11062 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తున్నాం. ఇది విద్యపై మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. తెలంగాణలో పేదలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా ఆకాంక్ష.

అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించాం. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని టెట్ నిర్వహణ తర్వాతే డీఎస్సీ నిర్వహించాం. టీజీపీస్సీని ప్రక్షాళన చేసాం. త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు ప్రకటించి తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తాం. మొదటి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నాం. టీచర్ ఉద్యోగం కేవలం ఒక ఉద్యోగం కాదు.. అది ఒక భావోద్వేగం. గత పదేళ్లలో విద్య నిర్లక్ష్యానికి గురైంది. మేం వచ్చాక విద్యాశాఖకు నిధుల కేటాయింపు పెంచాం. భవిష్యత్ లో మరిన్ని నిధులు కేటాయిస్తాం. గత ప్రభుత్వం స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించలేదు. అందుకే మా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోంది. 100 నియోజకవర్గాల్లో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ మధిరలో ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదు. మా ప్రభుత్వం వివాదాలకు తావు లేకుండా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసింది. కొన్ని రాజకీయ పార్టీల మీడియాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై మాపై దుష్ప్రచారం చేస్తున్నాయి. పదేళ్లు ప్రభుత్వంలో ఉన్నవాళ్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. అందుకే ఈ ఉపద్రవం వచ్చింది. వాటన్నింటిని పరిష్కరించుకుంటూ మేం ముందుకెళుతున్నాం. విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని మేం భావిస్తున్నాం. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయంలేకుండా ప్రభుత్వ పాఠాశాలలు నిర్వహిస్తాం. పేదలకు విద్య అందించడమే మా విధానం. పాఠశాల ఫీజుల నియంత్రణపై త్వరలో కమిటీ వేస్తామని సీఎం రేవంత్ ఈ సందర్భంగా తెలిపారు.

## రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై కీలక అప్‌డేట్



**నమస్తే హైదరాబాద్ :** తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న పరిశీలన సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని, పూర్తిగా పట్టణ/నగర ప్రాంతమైతే రెండు వార్డులు/ డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వార్డులు/ డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిట్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/ డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల పాటు చేపడతారని సీఎం ప్రశ్నించారు. అక్టోబరు మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అయిదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తే కుటుంబం ఫొటో తీయాలని, అదో అప్షనల్ గా ఉండాలని, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని.. అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. 2లో

## రాహుల్ గాంధీకి హారీష్ రావు లేఖ.

**నమస్తే హైదరాబాద్ :** తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తుందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగా కాకుండా, అధికార దుర్వినియోగంతో దుర్మార్గ, దుష్ట పాలన నడుస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వాన్ని, న్యాయాన్ని బుల్డోజర్ కింద తొక్కి అణచివేస్తూ, రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతున్నట్లు లేఖలో విమర్శించారు. మూసి రివర్ ఫ్రంట్, హైడ్రా ప్రాజెక్టుల విషయంలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనమన్నారు. తమ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న నిరంకుశ పాలనకు బుల్డోజర్ ప్రతీకగా మారిందన్నారు. అది తెలంగాణలో పౌరహక్కులను నిరంతరం ధిక్కరిస్తోందన్నారు. హైడ్రా, మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల పేరుతో పేద, మధ్యతరగతి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా అన్ని చట్టపరమైన పత్రాలతో నివసిస్తున్న వారి ఇళ్లను



టార్గెట్ చేస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తూ బుల్‌డోజర్ పాలన నడుపుతున్నట్లు పేర్కొన్నారు. 2లో

## సీఎంపై కేసు నమోదు చేసిన ఈడీ



**నమస్తే హైదరాబాద్ :** న్యూఢిల్లీ: మైసూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ కి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారంనాడు కేసు నమోదు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రశ్నించేందుకు సమన్లు జారీ చేయడం, విచారణలో ఆస్తులను జప్తు చేసే అధికారం ఈడీకి ఉంటుంది. బెంగళూరులోని ప్రత్యేక కోర్టు ఆదేశాలతో సెప్టెంబర్ 27న రాష్ట్ర లోకాయుక్త పోలీసులు సిద్ధరామయ్య, మరి కొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన క్రమంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సిద్ధరామయ్య, ఆయన భార్య బీఎం పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, దేవరాజ్ అనే వ్యక్తి పేర్లు ఉన్నాయి. దేవరాజ్ నుంచి మల్లికార్జున స్వామి భూమిని కొనుగోలు చేసి పార్వతికి గిఫ్ట్ ఇచ్చినట్టు ఆరోపణ. ముడా కుంభకోణం కేసులో సిద్ధరామయ్యపై దర్యాప్తు చేయాలంటూ బెంగళూరు స్పెషల్ కోర్టు సెప్టెంబర్ 25న ఉత్తర్వులు ఇచ్చింది.


## హైడ్రా చుట్టూ తెలంగాణ పాలిటిక్స్..

**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్ పరిధిలోని ఆక్రమణలను కూల్చే ప్రక్రియలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అస్సెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) దూసుకుపోతోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టిన హైడ్రా.. కొత్తగా కూల్చే నిర్మాణాలకు మార్కింగ్ చేపడుతోంది. 2లో

## దసరాకు ప్రత్యేక బస్సులు..

**నమస్తే హైదరాబాద్ :** ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల సమయాభావం తగ్గించేందుకు హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి దసరాకు ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్ నగర్, కేపీహెచ్‌బీ, తదితర ప్రాంతాల నుంచి స్పెషల్ సర్వీసులను అందుబాటులో ఉంచనుంది. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాలకు బస్సులను నడిపేలా ప్లాన్ చేసింది. దసరా పండుగకు ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై తమ క్షేత్ర స్థాయి అధికారులతో టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ వర్చ్వల్‌గా సమావేశమయ్యారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. గత దసరాతో పోల్చితే ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, గతంలో మాదిరిగానే 2లో

## 125 ఏళ్లు ఆయన బతకాలి, మోదీ అంతకాలం పాలించాలి



**నమస్తే హైదరాబాద్ :** న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గద్దె దింపేవరకూ తాను చనిపోనంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై మాటల యుద్ధం జరుగుతోంది. దీనిపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్యానాలో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో స్పందించారు. మల్లికార్జున్ ఖర్గే 125 ఏళు బతకాలని, ప్రధాని మోదీ 125 ఏళ్లు ప్రధానిగానే ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని చెప్పారు. మల్లికార్జున్ ఖర్గే జమ్మూకశ్మీర్‌లోని కథువాలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వేదికపై స్పృహతప్పి పడిపోతున్న తరుణంలో భద్రతా సిబ్బంది, ఇతర కాంగ్రెస్ నాయకులు ఆయన దగ్గరకు వెళ్లిపట్టుకున్నారు. కొద్దిసేపు ప్రసంగాన్ని నిలిపివేసిన అనంతరం తిరిగి ఖర్గే మాట్లాడుతూ, మోదీని గద్దె దింపేవరకూ తాను చనిపోనంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం తన వయస్సు 83 ఏళ్లని, ఇప్పుడిప్పుడే చనిపోనంటూ వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై కీలక అప్‌డేట్

ప్రభుత్వం వద్దనున్న రేషన్ కార్డు, పింఛను-స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ బీమా, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. పైలెట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను పరిహరించిన అనంతర పూర్తి స్థాయి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడదామని ముఖ్యమంత్రి తెలిపారు.

# రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ.

బుల్డోజర్ విధానం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ క్రూరత్వానికి ప్రతిరూపంగా మారిందని లేఖలో ప్రస్తావించారు. అడుగడుగునా చట్టాలను తుంగలో తొక్కుతూ, సహజ న్యాయ సూత్రాలను కాలరాస్తూ తమ పార్టీ ముఖ్యమంత్రి పాలన కొనసాగుతుందని విమర్శించారు. బుల్డోజర్లు 100 ఏళ్ల క్రితం నుంచి ఇళ్లను, కార్యాలయాలను, రహదారులను ఇతర నిర్మాణాలను నిర్మించడానికి ఉపయోగించేవారని, కానీ ఇప్పుడు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు నిర్మాణాలను కూల్చేందుకు ఉపయోగించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, గుజరాత్, అస్సాం, మహారాష్ట్ర రాష్ట్రాల్లో పేదలు, మధ్య తరగతిపై బీజేపీ బుల్డోజర్లను ఎలా ఉపయోగించిందో, కాంగ్రెస్ కూడా తెలంగాణలో అదే విధంగా ఉపయోగిస్తుందన్నారు. ఈ విషయంలో బీజేపీ దారిలోనే కాంగ్రెస్ నడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుల్డోజర్ కూల్చివేతల మీద సుప్రీం కోర్టు తాజా తీర్పు ఉన్నప్పటికీ, తగిన సర్వేలు నిర్వహించకుండా, సరైన విధానాలను అనుసరించకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో పేదల ఇండ్లను బుల్డోజ్ చేస్తూ, వారిని కన్నీరు పెట్టిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరచిన సహజ న్యాయ సూత్రాలను, చట్టాలను గౌరవించే విధంగా తమ ముఖ్యమంత్రికి సలహా ఇవ్వమని, తద్వారా రాష్ట్రంలో ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాహుల్‌ని లేఖలో కోరినట్లు హరీష్ రావు తెలిపారు.

# దసరాకు ప్రత్యేక బస్సులు..

ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రద్దీని బట్టి ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఈ పండుగలకు 6 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 15వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు.

# హైడ్రా చుట్టూ తెలంగాణ పాలిటిక్స్..

పలు చోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నా.. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగిపోతున్నారు. ఓవైపు హైడ్రా కూల్చివేతలు కొనసాగుతుండగానే.. దీనిపై రాజకీయ రగడ కొనసాగుతోంది. ఓ రకంగా తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు హైడ్రా చుట్టూనే నడుస్తున్నాయి. హైడ్రా తీరుపై ఇప్పటికే విపక్షాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణలో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. పదేళ్ల తర్వాత అధికారం కోల్పోయి, పార్టీ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు చేజారుతున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి హైడ్రా రూపంలో సరికొత్త అస్త్రం అందివచ్చినట్లయింది. హైడ్రా పట్ల సామాన్య ప్రజల్లో తాజాగా వ్యక్తమవుతున్న వ్యతిరేకతను పార్టీ పునరుజ్జీవనం కోసం వాడుకోవడంలో సఫలీకృతం అవుతున్నది. ఎమ్మెల్యేల ఫిరాయింపులు మొదలు%ొ% రైతుభరోసా, రుణమాఫీ, ఆరుగ్యారెంటీలు ఇవేవీ ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం కల్పించలేకపోయాయి. కానీ తాజాగా హైడ్రా మాత్రం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ముప్పేట దాడి చేయడానికి బీఆర్ఎస్‌కు అందివచ్చిన అవకాశంగా మారింది. పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను హైడ్రా అన్యాయంగా కూల్చేస్తోందన్న అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రజల్లో కలిగించడంలో బీఆర్ఎస్ సఫలీకృతం అయ్యింది. అంతేకాదు, తమదెబ్బకు ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిందని భావిస్తోంది గులాబీ హైకమాండ్%ొ% ఈ పోరాటాన్ని ఇంతటితో ఆపకుండా.. సేమ్ ఫ్లో కంటిన్యూ చేయాలని నిర్ణయించినట్లు గులాబీ జోష్ తేటతెల్లం చేస్తుంది.తెలంగాణ రాష్ట్రం సాధించిన ఉద్యమ పార్టీగా ఉన్న టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఇక నుంచి మాది ఫక్తు రాజకీయ పార్టీ, జాతీయ రాజకీయాలను శాసిస్తామంటూ బీఆర్ఎస్‌గా పేరు మార్చుకుంది. అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై పదేళ్ల అధికారాన్ని కాంగ్రెస్‌కు అప్పజెప్పింది. ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికల్లో దారుణ ఓటమిని చవి చూసింది. ఒక్కటంటే ఒక్క పార్లమెంటు సీటును కూడా గెలువలేకపోవడం 24 ఏళ్ల పార్టీ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. వరుస ఓటములతో నిస్తేజంలో కూరుకుపోయిన బీఆర్ఎస్ కు హైడ్రా కూల్చివేతలు రాజీకీయంగా అస్త్రాలు మారాయి. పేదల ఇళ్లను కూలుస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు క్షేత్రస్థాయికి వెళ్లి ఆందోళనలకు దిగుతున్నారు. తమను రక్షించాలని బాధితులు గులాబీ వాకిలి తొక్కుతుండటం ఆ పార్టీ నేతలు మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు రాస్తా క్లియర్ చేసింది. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీఆర్ఎస్ రాజకీయంగా బలమైన అస్త్రంగా మార్చుకోడానికి ఉపయోగపడింది. ఆలస్యంగా కళ్లు తెరిచిన బీజేపీ హైడ్రాకు వ్యతిరేకంగా కొండంత రాగం తీసినా లాభం లేకపోయింది. చెరువులు, కుంటల రక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు తొలుత అన్ని వర్గాల నుంచి మంచి స్పందన లభించింది. చెరువులు, నాళాలను అక్రమించి కట్టిన కట్టడాలను కూల్చివేసిన హైడ్రాకు ప్రజలు జేజేలు పలికారు. ప్రతిపక్ష పార్టీలు సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని ముక్తకంఠంతో సమర్థించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దీంతో హైడ్రా మరింత దూకుడు పెంచింది. ఈ క్రమంలో హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న కూల్చివేతలపై సర్వత్రా చర్చ జరిగింది. మరీ ముఖ్యంగా నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయడంతో అందరి దృష్టి హైడ్రాపై పడింది.

# గ్రామ అభివృద్ధికి యువకుల సహకారం... అభినందించిన గ్రామస్తులు



నాగారం, నమస్తే హైదరాబాద్ :(సెప్టెంబర్ 30) గ్రామ అభివృద్ధికి తమ వంతుగా ముందుకు వచ్చి సహకారం అందించిన యువకులను అభినందించిన మాచిరెడ్డిపల్లె గ్రామస్తులు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిధులు లేక గ్రామంలో లైట్లు లేక అంద కారంలో కొట్టుమిట్టాడడంతో యువకులు మాద అశోక్ ,నాతి మహేష్ , తాడోజు అశోక్ తాడోజు అజయ్, కోడూరు నరేష్, హరీష్, మహేందర్, నాతి భాస్కర్ ,నాతి వికాస్ ,ప్రసాద్ , సట్టు పరశురాములు, సట్టు నవీన్, నరేష్, ప్రవీణ్, నాతి విజయ్ లు స్పందించి 35 వేల రూపాయలు జమ చేసి గ్రామానికి సంబంధించిన మొత్తం వీధిలైట్లను కొనుగోలు చేసి గ్రామపంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆ యువకులను గ్రామస్తులతో పాటు మాజీ సర్పంచ్ పసుపులేటి ప్రేమలత వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శీల కృష్ణమూర్తి పిన్నపరెడ్డి సోమిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వడ్డే యాదగిరితో పాటు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వరి పత్తితో పాటు చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలి



నాగారం నమస్తే హైదరాబాద్: (సెప్టెంబర్ 30) రైతులు వరి పతితో పాటు చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ అన్నారు. సోమవారం నాగారం మండల కేంద్రంలో ఆగ్రో ఫెడ్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫర్టిలైజర్ అండ్ ఫెస్టిసైడ్స్ షాపును ప్రారంభించి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని అన్నారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని అన్నారు. ఈ సీజన్ నుండి రైతులు పండించిన పంటకు 500 రూపాయల బోనస్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. జనవరి ఒకటో తారీకు నుండి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం అందజేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రైతు రుణమాఫీ కింద నాగారం మండల పరిధిలో 45 కోట్ల 69 లక్షల పై చిలుకు రుణమాఫీ చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి ఫోటో పెట్టాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మి రైతులని మోసం చేయవద్దని కోరారు. నాఫెడ్ సంస్థల ద్వారా అందే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బ్రహ్మయ్య,ఎంపీడీవో ధారా శ్రీనివాస్,ఏవో కృష్ణ కాంత్, ఏపిఎం శోభారాణి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు,నియోజకవర్గ నాయకులు సుంకరి జనార్ధన్, మండల పార్టీ అధ్యక్షులు తొడుసు లింగయ్య,పిఏసిఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కన్నెబోయిన వెంకట భిక్షం, అనంతుల వెంకటయ్య, కడారి సోమయ్య, సైదులు,నా ఫెడ్ సంస్థ సీఈవో మల్లేష్, చైర్మన్ కొడకంటి సంధ్య, వైస్ చైర్మన్ కుంభం లింగయ్య, డైరెక్టర్లు,రైతులు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మందుల సామెల్

# ఎం ఏ నగర్ నీటి నిర్వహణపై అవగాహన ర్యాలీ

నమస్తే హైదరాబాద్, శేరిలింగంపల్లి న్యూస్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని ముజఫర్ అహ్మద్ నగర్ లో వాటర్ ఎయిడ్ ఇండియా కమ్యూనిటీ పేసిలటర్ దేవదాస్ మాట్లాడుతూ నీటి వృధాను అరికట్టి, లీకేజీల గుర్తించి సత్వరం వాటి మరమ్మత్తులు చేసుకోవాలని అవగాహన కార్యక్రమం గురించి వివరిస్తూ ఎం.ఎ నగర్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు దోర్నాలరవికుమార్, సురేష్ యాదవ్, కడుకుంట్ల రాంబాబు, బిజెపి నాయకులు ప్రవీణ్ గౌడ్, అనిల్ రెడ్డిల బృందం స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్, విద్యార్థులతో కలిసి ర్యాలీగా బయలుదేరి కాలనీలో వీధి వీధి తిరుగుతూ సేవ్ వాటర్, సేవ్ లైఫ్ అంటూ నినాదాలు చేస్తూ కాలనీ కలియ తిరిగారు. నీటి విలువ గురించి తెలియపర్చుతూ నీటి వృధాను అరికట్టాలని, ప్రతీ ఇంట్లో నీటి నిలువ ట్యాంకులు నిండితే వెంటనే నల్ల కట్టేసి ఇతరుల అవసరాల కోసం వారికి ఆ నీరు ఉపయోగ పడుతుంది అని వృథాగా రోడ్ల పైకి, డ్రైనేజ్ లో కి వదలవద్దు అని తెలియ జేశారు. హైటెక్ జోన్ లో నీటి ఇబ్బందులు రాకుండా ప్రతీ గృహ నిర్మాణ దారుడు ఇంకుడు గుంతలు విధి గా ఏర్పాటు చేసుకోవాలి అని, అలాగే లీకేజీ లాంటివి ఉంటే వెంటనే మరమ్మత్తులు చేసుకోవాలని మానవుని దైనందిన జీవితంలో నీటి యొక్క అవసరత, దాని పొదుపు గా వాడుకోవాలిసిన ఆవశ్యకతను బండి రామకృష్ణ గౌడ్, కడుకుంట్ల రాంబాబు లు వివరిస్తూ భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగితే అవి మనకు ఉపయోగ పడతాయి కాబట్టి దీనిపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ ఉండాలని అన్నారు. లేదంటే పొరుగు రాష్ట్ర మైన కర్ణాటక నీటి కష్టాలు వస్తాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవీన్ నేత, మధు, శ్రీకాంత్, సత్య రాజ్, నాగేష్, హీరా వర్ధన్, సుమన్, రాజి రెడ్డి లతో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు




# అధికారులతో పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే గాంధీ సమీక్ష సమావేశం



నమస్తే హైదరాబాద్, శేరిలింగంపల్లి న్యూస్ : భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో పలు సమస్యలు చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనులపై మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ,ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎంఐజి కాలనీ అభివృద్ధి కి కట్టుబడి ఉన్నాం అని, కాలనీలో అన్నిరకాల మౌళికవసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.ప్రజావసరాల దృష్ట్యా కాలనీ లలో నెలకొన్న రోడ్ల సమస్యలను ప్రథమ ప్రాధాన్యత గా పరిగణలోకి తీసుకోని త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని, పనులలో వేగం పెంచాలని అలసత్వం ప్రదర్శిచకూడదని చెప్పారు.వర్షాల వలన దెబ్బ తిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని,కాలనీలలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను త్వరితగతిన వేయాలని అధికారులకు ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు. ఎంఐజి కాలనీ లో పారిశుధ్య నిర్వహణ పనులలో అలసత్వం ప్రదర్శించకూడదని, చెత్తకుప్పలు లేకుండా చూడాలని , చెత్త చెదరాం లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, కాలనీ లో రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎల్లవేళలలో అందుబాటులో ఉండి,క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ హెచ్ శ్రీకాంత్ రెడ్డి, జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏఈ రషీద్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, ఆదర్శ్ రెడ్డి, భాస్కర్, నాగమణి,కాలనీ సొసైటీ ప్రెసిడెంట్ వెంకట్ రావు, వైస్ ప్రసిడెంట్ నారాయణ్ గౌడ్,డైరెక్టర్ నీలకంఠం,సీనియర్ సిటిజన్స్ సత్యనారాయణ, బాగర్డే ,భీం రెడ్డి,వెంకట్ రెడ్డి,కృష్ణయ్య కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఔషపూర్ లో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం




ఘట్కేసర్ సెప్టెంబర్ 30 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఔషపూర్ గ్రామంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తాల్లు రాములు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కావ్య, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ విచ్చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం, దళితులను కుల వివక్షకు గురైతే, దళితులను ఎవరైనా తిట్టినా కొట్టిన వారి భూములు లాక్కున్న, భయభ్రాంతులకు గురిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ జ్యోతి, వీఆర్ఏ చందు ముదిరాజ్, ఔషపూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



నాగారం, నమస్తే హైదరాబాద్ :(సెప్టెంబర్ 30) నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లా అంగన్వాడి కేంద్రంలో సోమవారం ఘనంగా వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులను శాల్వలు పూలమాలతో సత్కరించారు. అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ ప్రమీల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సుమిత్ర హరిత సరస్వతి లక్ష్మీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవలు నేటితరం వారికి స్ఫూర్తిదాయకం



హనుమకొండ, సెప్టెంబర్ 30 (నమస్తే హైదరాబాద్ ) ఎన్నో త్యాగాలు, కష్టనష్టాలను అధిగమించి విజయవంతంగా విధులు నిర్వహించిన మీరూ నేటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకం అవుతారని వరంగల్ పోలీస్ కమిషనర్ పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులకు తెలిపారు. వరంగల్ పోలీస్ విభాగంలో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి సోమవారం పదవీవిరమణ చేస్తున్న పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పదవీవిరమణ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పదవీవిరమణ పొందుతున్న ఎస్.ఐలు సయ్యద్ యూసుఫ్, కుమారస్వామిలను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతుడుతూ సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో పనిచేయడమే కాకుండా క్లిష్టసమయాల్లో విధులు నిర్వహించి నేడు శాంతియుతమైన వాతవరణం కల్పించడంలో వీరు ప్రధాన కారకులని. ముఖ్యంగా పోలీసులు తమ విధుల్లో రాణించడం ప్రధాన కారణం వారి కుటుంబ సభ్యులని, కుటుంబ సభ్యులు ఇచ్చిన సహకారంతోనే పోలీసులకు అప్పగించిన పనుల్లో రాణిస్తున్నారని, పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీ లు రవి, సంజీవ్, సురేష్కుమార్, ఏసీపీ సురేంద్ర,ఆర్.ఐలు ఆర్.ఎస్.ఐలు పదవీవిరమణ పొందిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బొంతు రామ్మోహన్ తల్లి బొంతు కమలమ్మకు ఎమ్మెల్యే గాంధీ సంతాపం...



నమస్తే హైదరాబాద్( శేరిలింగంపల్లి న్యూస్ ) హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మ మృతి చెందడంతో చర్లపల్లిలోని వారి నివాసానికి వెళ్లి కమలమ్మ పార్థీవ దేహానికి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు తో కలిసి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దళిత బంధు నిధులు వెంటనే విడుదల చేయాలి

## తుంగతుర్తి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన లబ్ధిదారులు



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 30: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళితుల అభ్యున్నతి కోసం చేపట్టిన దళిత బంధు పథకంలో మంజూరైన నిధులను నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేసి దళితులను ఆదుకోవాలని తుంగతుర్తి మండల లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరారు. తుంగతుర్తి మండల దళిత బంధు లబ్ధిదారులు సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన లబ్ధిదారులందరికీ కేటాయించిన నిధులను తక్షణమే వారి ఆ కౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు కేటాయించిన నిధులను ఖాతాల్లో జమ చేయకపోవడం తీరని అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం తక్షణమే స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. కనీసం లబ్ధిదారులకు మంత్రులు అపాయింటెమెంట్ ఇవ్వకపోవడం చాలా బాధాకరమని అన్నారు. దళిత బంధు లబ్ధిదారులు ఎన్నోసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన, ధర్నాలు, నిరసనలు చేపట్టిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్లెపాక రాములు, గుడిపాటి వీరయ్య, చింతకుంట్ల పరమేష్, పాల్వాయి వెంకన్న, గడ్డం సోమేశ్, కొమ్ము వెంకన్న, వెంకనర్సు, జిలకర పరుశురాములతో పాటు తదితర దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# టీచర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ TEA 2024

%నమస్తే హైదరాబాద్ (మేడిపల్లి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (అక్టోబర్ 5) సందర్భంగా %ఖ+% నుండి %గా+% వరకు ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టీచర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ %ుజూా%-2024 తో సత్కరించబడును.

సాంస్కృతిక మరియు క్రీడా రంగాల ఉపాధ్యాయులు కూడా అర్హులు

నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్- 5 -2024...

మీరు బోధిస్తున్న ఫోటోతో మీ పూర్తి వివరాలను పంపండి.

వివరాలకు:

9392937486

డా: కమల మనోహర్

చైర్మన్ -

ఎం.స్వామి దాస్


జనరల్ సెక్రటరీ - శారద ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్

# పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నాగారం నమస్తే హైదరాబాద్: (సెప్టెంబర్ 30 ) మండల పరిధిలోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే మందుల సామేలు సోమవారం పరామర్శించారు. వివరాలలోకి వెళ్తే పేరబోయిన గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గండమల లక్ష్మయ్య సతీమణి గండమల్ల కళమ్మ మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఫణిగిరి గ్రామానికి చెందిన వడ్డేపల్లి సోమయ్య మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ? 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం సలీబండ్ల రాయల్ రెడ్డి అనారోగ్యం తో బాధ పడుతుండగా వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు నియోజకవర్గ నాయకులు సుంకరి జనార్ధన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య,గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దు..'



నమస్తే హైదరాబాద్ : తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం దేశ వ్యాప్తంగా కుదిపేస్తున్న సంగతి తెలిసిందే. తిరుమల తిరుపతి దేవస్థానానికి దేశం నుంచి మాత్రమే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు వస్తుంటారు. ఇక్కడ మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో దైవాన్ని దర్శించుకుని వెళ్తుంటారు. ఇక్కడ ఇచ్చే లడ్డూ ప్రసాదం పరమ పవిత్రంగా భావిస్తుంటారు భక్తులు. అలాంటిది.. కూటమి సర్కార్ తిరుమల లడ్డూపై పెద్ద దుమారమే లేపారు. వెంకన్న లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందంటూ లబలబలాడిపోయింది. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుమల లడ్డూపై మాట్లాడిన ప్రతి ఒక్కరిపై ఓ రేంజ్లో చిందులు తొక్కాడు. దీంతో శ్రీవారి లడ్డూ వివాదం పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది.దీనిపై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఏపీ రాష్ట్ర సర్కార్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నెయ్యిని రిజెక్ట్ చేశారని టీటీడీ ఈవో చెప్పారు కదా? రిజెక్ట్ చేశాక ఇక వాడే అవకాశం ఉండదు కదా అని ప్రభుత్వం తరుపున లాయర్ను ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్డీడీబీ మాత్రమే ఎందుకు? మైసూర్ లేదంటే గజియాబాద్ ల్యాబ్ల నుంచి సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని టీటీడీని ప్రశ్నించింది. నెయ్యి కల్తీ జరిగినట్టు గుర్తించిన తర్వాత తయారైన లడ్డూలను టెస్టింగుకు పంపారా? లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. ఎలాంటి పూర్తి ఆధారాలు లేకుండా లడ్డూలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగినట్టు ప్రభుత్వం ప్రకటన చేయడం ఏంటని? సుప్రీంకోర్టు మండిపడింది. ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రి పదవిలో ఉండి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. రాజ్యాంగ పదవిలో ఉన్నప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి కదా అంటూ నిలదీసింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంపై రెండో ఒపీనియన్ తీసుకోకుండా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. పైగా ఈ వ్యవహారంలో మీడియా ముందుకు వెళ్లి అలాంటి ప్రకటనలు చేస్తూ కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తీస్తున్నారంటూ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసినట్లు ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఇరువాదనలు విన్న కోర్టు కనీసం దేవుడినైనా రాజకీయాల నుంచి దూరం పెట్టాలని నేతలకు సూచించింది.

# మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకుడు



దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్) దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన కారుపోతుల రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు కారు పోతుల నరేష్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఏనాడో మహానుభావులు చెప్పారు. విధి రాతను మార్చుకుని.. తన రాతను తానే రాసుకొని అనుకున్నది సాధించవచ్చని పట్టుదలతో ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. పిఆర్టి 2024 ఫలితాలలో పిఈటి, పిడి 2017 గురుకులాల బిఈడి ఫలితాలలో పిఈటి మొత్తం మూడు ఉద్యోగాలు సాధించాడు.

# పౌర హక్కుల దినోత్సవ సమావేశం



నాగారం, నమస్తే హైదరాబాద్ :(సెప్టెంబర్ 30) మండల పరిధిలోని వర్ధమానుకోట ఎస్సీ కాలనీలో పౌర హక్కుల సమావేశం మండల వెల్ఫేర్ ఆఫీసర్ సోమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలకు ఎస్సీ ఎస్టీ చట్టంపై అవగాహన కల్పించారు. ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కాలర్షిప్ స్కీమ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షాహిన్ బేగం, పంచాయతీ సెక్రెటరీ అంబేద్కర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేయండి..!

## ప్రజావాణిలో దరఖాస్తు చేసిన కమిటీ సభ్యులు




మేడిపల్లి (నమస్తే హైదరాబాద్): పీర్జాదిగుడా మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి సహకారంతో సాయి హిల్స్ కాలనీ అధ్యక్షులు ఎంమధుసూధన్,ప్రధానకార్యదర్శి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలోని పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేయాలని కమిటీ సభ్యులు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ గారికి ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మధు సుధన్ మరియు ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి గ వర్కింగ్ ప్రెసిడెంట్ పి భాను శేఖర్ మరియు ట్రెజరరీ హరినాథ్ గౌడ్ మరియు వైస్ ప్రెసిడెంట్, సామ వెంకటరెడ్డి ఏపీ రాజారెడ్డి మరియు కిరణ్ కుమార్ రెడ్డి జాయింట్ సెక్రెటరీ వేణు గోపాల్ శ్రావణ్ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకేష్ రెడ్డి పాల్గొన్నారు

# ఉదయం నిద్రలేచిన వెంటనే తలనొప్పి వస్తోందా?

తలనొప్పి అనేది ఒక సాధారణ సమస్య. కొందరికి ఉదయం లేవగానే ఈ సమస్య మొదలవుతుంది. దీనిని ఎదుర్కోవటానికి, ప్రజలు తరచుగా మందులు తీసుకుంటారు. అయితే ఈ సమస్య ఎందుకు వస్తుందో తెలుసా? మీరు ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన వెంటనే తలనొప్పి సమస్యతో పోరాడుతుంటే, మీరు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. నిద్రలేవగానే తలనొప్పి ఎందుకు వస్తుందో ముందుగా తెలుసుకుందాం.నిద్ర, తలనొప్పి మధ్య సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. నిద్రలేమి తలనొప్పికి కారణమైనట్లే, ఎక్కువ నిద్రపోవడం కూడా తలనొప్పికి కారణమవుతుంది. తలనొప్పి, నిద్ర సమస్యలు ముడిపడి ఉన్నాయి. నిద్ర లేకపోవడం వల్ల కూడా మీకు తీవ్రమైన తలనొప్పి రావచ్చు. ఒత్తిడి కూడా తలనొప్పికి కారణమవుతుంది. ఇది నిద్రను కష్టతరం చేస్తుంది. ఇది మరింత తలనొప్పికి దారితీస్తుందని వైద్యులు చెబుతున్నారు. స్లీప్ అప్నియాతో బాధపడేవారు కూడా ఉదయం లేవగానే తలనొప్పిగా అనిపించవచ్చని నివేదికలు చెబుతున్నాయి. తలనొప్పితో మేల్కొనడం ఎలా ఆపాలి? ఈ సమస్యను నివారించడానికి మంచి నిద్ర షెడ్యూల్‌ను పాటించడం చాలా ముఖ్యం. మీరు ఒకే సమయంలో పడుకుని మేల్కొనడానికి ప్రయత్నిస్తే, మీ తలనొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు.

# మోటె చిరంజీవి కి గౌరవ డాక్టరేట్



హనుమకొండ, సెప్టెంబర్ 30 )(నమస్తే హైదరాబాద్) కవిగా, రచయితగా, వ్యాఖ్యాతగా, గాయకుడి గా మరియు కాలమిస్ట్ గా రాణిస్తూ, ప్రార్థించే పెదవులకన్నా, సేవ చేసే చేతులు మిన్న అనేటువంటి దృక్కోణంతో గత 20 సంవత్సరాల నుండి అనేక స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తూ 2017 లో మదర్ ఫౌండేషన్ స్థాపించిన, మదర్ ఫౌండేషన్ చైర్మన్ మోటె చిరంజీవి ఆధ్వర్యంలో అలాగే మదర్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ ,ప్రభుత్వేతర అధ్యాపకులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు, సామాజికవేత్తలకు, స్వచ్ఛంద సంస్థ సేవాప్రతినిధులకు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచినటువంటి వారికి ,పలు అవార్డులు ఇస్తూ, సన్మానం చేస్తూ, తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటున్నారు వ్మెటె చిరంజీవి. విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.సుమారుగా పది వరకు డాక్యుమెంటరీలను పొందుపరిచాడు .అన్నదాతకు ఆసరా, ఒత్తిడి లేని విద్యా, ఆత్మహత్యల నివారణకు యువతా మేలుకో వంటి డాక్యుమెంటరీలు ఎంతో గుర్తింపును ఇచ్చాయి. ఇవే కాకుండా ప్రతి సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి వివిధ రంగాలకు చెందినటువంటి కళాకారులకు ,ప్రతిభ కనబరచిఅటువంటి వారికి ,పలు రకాల అవార్డులు ఇస్తూ ,షీల్డు ,శాలువా ప్రశంసాపత్రాలతో మంత్రులతో ప్రభుత్వ అధికారులు గా ఉన్నత హోదాలో ఉన్నటువంటి వారితో సన్మానిస్తున్నారు.మదర్ ఫౌండేషన్ ద్వారా కొన్ని వందల సంఖ్యలో ఉచిత మెగా వైద్య శిభిరాలు, రైతులు,శాస్త్రవేత్తలు ,వ్యవసాయ అధికారులచే అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడమే కాకుండా వారికి వివిధ రకాల అవార్డులతో సత్కరించారు.కరోనా కష్టకాలంలో కూడా నూటాయాభై మంది వలస కూలీలకు నలభై అయిదు రోజుల పాటు భోజన వసతి, వారు ఉండేందుకు వసతిని కూడా ఏర్పాటు చేశాడు.ఎనభై వేల మాస్కులను గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలకు ,పరీక్షలు రాసే విద్యార్థులకు, విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నటువంటి అధ్యాపకులకు అందజేయడం జరిగింది. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి మోటె చిరంజీవి సాధారణ ప్రయివేటు అధ్యాపకుడు తనకు వచ్చిన జీతంలో కొంత భాగాన్ని ఖర్చుచేస్తూ ఈ విధంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, నర్సులకు ,డాక్టర్లకు, ఆశా వర్కర్లకు, పోలీసు సిబ్బందికి సైతం, జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నూటయాభైమందికి ఫ్రంట్లైన్ వారియర్స్ ను గుర్తించి వారికి ఉత్తమ సేవా పురస్కార అవార్డు తో సన్మానించారు. రెడ్డి ,మాజీ స్పీకర్ మధుసూదనాచారి వంటి వారితో ఘనంగా సన్మానించడం జరిగింది. ఒక మనిషిలో ఒక ఉద్యమకారుని చూడొచ్చు, ఒక కళాకారుని చూడొచ్చు, ఒక వ్యాఖ్యాతను చూడొచ్చు, ఒక అధ్యాపకుడిని చూడొచ్చు, ఒక గాయకున్ని చూడొచ్చు , ఒక విశ్లేషకుల్ని చూడొచ్చు కానీ మ్మెటె చిరంజీవి అన్నీ కలగలిపిన ఒక మహోన్నత వ్యక్తిగా, బహుముఖ ప్రజ్ఞాశాలి గా, అనేకమందికి సేవ చేస్తూ సేవాతత్పరుడిగా తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అంతేకాకుండా సమాజహిత రచనలు చేయాలనే దృక్పథంతో అనేక సంపాదకీయ రచనలు చేశారు. తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయలకు ప్రతిబింబించే బతుకమ్మ పండుగ ఆవశ్యకతను బతుకమ్మ పండుగ సందర్భంగా విడియ్మో పాటలను రూపొందించారు.అంతేకాక చిరంజీవి సేవను గుర్తించిన పలు స్వచ్ఛంద సంస్థలు పలు అవార్డులను ఇవ్వడం జరిగింది. పద్ధెనిమిది వరకు ఇంటర్నేషనల్ అవార్డులు ,డెబ్బై వరకు జాతీయ అవార్డులు, వందకు పైగా రాష్ట్ర స్థాయి అవార్డులు పొందారు .డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ,బాబూ జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిబా పూలే ,మదర్ సేవారత్న ,ఉత్తమ సేవా పురస్కార్,కళారత్న, కాళోజీ అవార్డు, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డ్ మరియు వరల్డ్ బుక్ అఫ్ రికార్డ్,వండర్ బుక్ అఫ్ రికార్డ్ ,తెలుగు బుక్ అఫ్ రికార్డు వంటివి అనేకం పొందడం జరిగింది .గిన్నీస్ బుక్ అఫ్ రికార్డు కోసం 1000 మందితో ఇంటర్నేషనల్ లంబాడీ డాన్స్ ఫెస్టివల్ ను మ్మొట్ట మ్మొదటి గారిగా ఏర్పాటు చేయడం జరిగింది.ఇవేకాకుండ సుద్దాల అశోక్ తేజ, అర్ పి పట్నాయక్, జేడి లక్ష్మినారాయణ,మాజీ గవర్నర్ రోషయ్య వంటి ప్రముఖుల చేతుల మ్మీదుగా ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇంతటి అకుంటిత దీక్షతో పనిచేస్తు తనకు రేడియో స్టేషన్ లో వచ్చిన జీతంతో అనేక సామాజిక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. సమాజ హితం కోసం పని చేస్తున్నటువంటి సామాజికవేత్తకు హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్ లో నిర్వహించిన కార్యక్రమంలో స్ఫూర్తి సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ (యూ ఎస్ ఎ ) వారు మదర్ ఫౌండేషన్ చైర్మన్ మోటె చిరంజీవిని గౌరవ డాక్టరేట్ తో ఘనంగా సన్మానించారు. ఈ అవార్డును స్ఫూర్తి సోషల్ సర్వీస్ సొసైటీ ముఖ్య సలహాదారులు గూడూరు చెన్నారెడ్డి, స్ఫూర్తి సోషల్ సర్వీస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ రమేష్ చేతులమీదుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ అందుకున్న అవార్డు గ్రహీత మోటార్ చిరంజీవి మాట్లాడుతూ ఈ డాక్టరేట్ అవార్డు నాలో బాధ్యతను పెంచిందని, మునుముందు మరిన్ని ఉన్నత సేవా కార్యక్రమాలు చేసేందుకు స్ఫూర్తి నింపిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రుద్రమదేవి, కన్నడ నటుడు అశోక్,షేక్ హుస్సేన్, పర్వీన్, నాగ స్వామి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో.. ముఖేష్ అంబానీ రోజుకు ఇంత సంపాదిస్తున్నారా?



రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, ఎండీ ముఖేష్ అంబానీ భారతదేశంలోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడు. అతని నికర విలువ సుమారు %వి%116 బిలియన్లుగా అంచనా. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, అతను ప్రస్తుతం ప్రపంచంలోని 12వ అత్యంత సంపన్న వ్యక్తి. అతని తర్వాత, గౌతమ్ అదానీ %వి% 104 బిలియన్ల నికర విలువతో ఈ జాబితాలో ఉన్నారు. అయితే భారతదేశంలోని అత్యంత ధనవంతుడు ముఖేష్ అంబానీ రోజుకు ఎంత సంపాదిస్తున్నారని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? దీని గురించిన సమాచారాన్ని తెలుసుకుందాం.

ముఖేష్ అంబానీ రోజుకు రూ.163 కోట్లు సంపాదిస్తున్నారు:

ముఖేష్ అంబానీ సంపదను అంచనా వేయవచ్చు. ఒక భారతీయుడు ప్రతి సంవత్సరం రూ. 4 లక్షలు సంపాదిస్తే, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ప్రస్తుత సంపదకు చేరుకోవడానికి 1.74 కోట్ల సంవత్సరాలు పడుతుంది. ఇది దాదాపు అసాధ్యం. నివేదికల ప్రకారం.. ముఖేష్ అంబానీ ప్రతి సంవత్సరం దాదాపు 15 కోట్ల రూపాయల జీతం తీసుకునేవారు. కానీ, కరోనా తర్వాత జీతం తీసుకోవడం లేదు. ఇదిలావుండగా ఆయన రోజుకు రూ.163 కోట్లు సంపాదిస్తున్నారు. ఈ డబ్బు అతనికి రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో వాటా నుండి వస్తుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ పెట్రోకెమికల్, ఆయిల్, టెలికాం, రిటైల్ వంటి అనేక రంగాలలో వ్యాపారాన్ని విస్తరించింది. ఇది కాకుండా, అతను ముంబైలోని తన ఇల్లు యాంటిలియాతో సహా రియల్ ఎస్టేట్‌లో చాలా ప్రదేశాలలో పెట్టుబడి పెట్టాడు. యాంటిలియా విలువ దాదాపు రూ.15 వేల కోట్లు ఉంటుందని అంచనా.

2020 నాటికి ప్రతి గంటకు రూ.90 కోట్లు: 2020 నాటికి ముఖేష్ అంబానీ ప్రతి గంటకు రూ.90 కోట్లు సంపాదించారు. మరోవైపు, భారతదేశంలో దాదాపు 24 శాతం మంది ప్రజలు నెలకు రూ.3000 మాత్రమే సంపాదించగలుగుతున్నారు. అంబానీ కుటుంబ కార్యక్రమాలు కూడా వారి హోదాకు తగ్గట్టుగానే ఉంటాయి. ఈ ఏడాది తన చిన్న కొడుకు అనంత్ అంబానీ పెళ్లికి దాదాపు రూ.5000 కోట్లు వెచ్చించి యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ఈ పెళ్లికి సంబంధించిన ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ కార్యక్రమాలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఇది కాకుండా, సుమారు రూ. 1000 కోట్ల విలువైన బోయింగ్ 737 మ్యాక్స్‌ను కూడా తన జాబితాలో చేర్చుకున్నారు.

# టీమిండియా ధనాధన్ బ్యాటింగ్..

భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ రెండో టెస్టు ఉన్నట్లుండి ఆసక్తికరంగా మారిపోయింది. వర్షం కారణంగా మొదటి మూడు రోజులు ఆట తుడిచిపెట్టుకుపోగా, నాలుగో రోజు మాత్రం ఎడతెరిపినిచ్చింది. అయితే ఒక్కరోజులోనే మ్యాచ్ రూపురేఖలు మారిపోయాయి. మొదట భారత బౌలర్లు చెలరేగి తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్‌ను 233 పరుగులకే పరిమితం చేశారు. ఆ తర్వాత ధనాధన్ బ్యాటింగ్ తోనూ విరుచుకుపడి మొదటి ఇన్నింగ్స్ ను 285/9 కు డిక్లేర్ చేశారు. దీంతో మొదటి ఇన్నింగ్స్ లో భారత్ కు 52 పరుగుల ఆధిక్యం లభించింది. . భారత్ తరఫున యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ బాగా ఆడారు. యశస్వి జైస్వాల్ 51 బంతుల్లో 72 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ 43 బంతుల్లో 68 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లీ కేవలం 3 పరుగుల తేడాతో హాఫ్ సెంచరీని కోల్పోయాడు. అతను కేవలం 35 బంతుల్లో 47 పరుగులు చేశాడు. ఇందులో 4 ఫోర్లు, 1 సిక్స్ ఉన్నాయి. దీంతో టీమిండియా కేవలం 34.4 ఓవర్లలో 285 /9 వద్ద మొదటి ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసింది. బంగ్లాదేశ్ తరఫున షకీబ్ అల్ హసన్, మెహదీ హసన్ చెరో 4 వికెట్లు తీశారు. కాగా భారత్ దృష్టి ఇప్పుడు ఆధిక్యం కంటే ఓవర్లు, టైమింగ్‌పైనే ఉంది. నాలుగో రోజు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసినా 19 ఓవర్లు ఆడేందుకు మిగిలి ఉంది. అయితే ఈ 19 ఓవర్లు పూర్తవుతాయా లేదా అన్న సందేహం నెలకొంది. ఇక ఐదో రోజు 98 ఓవర్లు ఉంటాయి. అందువల్ల, బంగ్లాదేశ్ ను త్వరగా ఆలౌట్ చేసి మ్యాచ్ ఫలితాన్ని రాబట్టేలా రోహిత్ ప్రణాళికలు రచిస్తున్నాడు. ఇక నాలుగో రోజు పిచ్ స్పిన్‌కు సహకరించేలా ఉంది. ఇది కూడా మ్యాచ్ రిజల్ట్ పై ప్రభావం చూపవచ్చు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..